క్లుప్తంగా

ఇంజినీరింగ్ విద్యార్థులకు స్వాగత వేడుక



తిరువూరు: స్థానిక శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఈసీఈ విభాగంలో ప్రథమ సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్లు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ఇంజినీరింగ్ విద్యలో మెలకువలు, కోర్సు ప్రయోజనాలను వివరించారు. ఈసీఈలో ఉపాధి అవకాశాలను విభాగాధిపతి ఎం.హరికృష్ణ తెలిపారు. చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కరస్పాండెంటు పోట్రు నాగేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ఏఓ కిషోర్ పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించండి



ఇబ్రహీంపట్నం: సమాజంలో దివ్యాంగులను ఆదరించాలని మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ పుష్పలత అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో పూర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. పూర్ ఆర్గనైజేషన్ సమకూర్చిన ట్రై వీల్‌చైర్స్, కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు.

వరి పైరు పరిశీలన



మల్లేల(తిరువూరురూరల్): మండలంలో వరి పైర్లను ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. వర్షాభావం, నీటి ఎద్దడి కారణంగా వరిపైర్లు ఎండిపోతున్నాయని, దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆయనకు తెలియజేశారు. మల్లేల గ్రామంలో ఎండుతున్న వరిపైర్లను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్ వెంటనే సాగర్ జలాల విడుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజారక్షణ భేరి కరపత్రాల ఆవిష్కరణ

చాట్రాయి: బీజేపీ పాలనతో దేశం అస్తవ్యస్తంగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ఆరోపించారు. మంగళవారం చిన్నంపేట గ్రామంలో ప్రజా రక్షణ భేరి కరత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినా ప్రత్యేక హోదా, పోర్టులు, రైల్వే జోన్ లాంటి విభసన హామీలను కేంద్ర ప్రభుత్వం ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు.

క్రీడా పరికరాల పంపిణీ

చాట్రాయి: జనార్దనవరం గ్రామానికి చెందిన క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య సహకారంతో మంగళవారం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అత్తునూరి సుబ్బారెడ్డి, ఈడా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నూజివీడు: పోతురెడ్డిపల్లిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఆవరణలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు, గొల్లపల్లి, దిగవల్లి పీహెచ్‌సీ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రేపు సామాజిక భవనాల ప్రారంభం

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 19, 21, 22 వార్డుల్లో రూ.75లక్షలతో నిర్మించిన మూడు సామాజిక భవనాలు, రూ.40 లక్షలతో 20వ వార్డులో నిర్మించిన నూతన వార్డు సచివాలయ భవనం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ గురువారం ఉదయం ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కొండపల్లి మున్సిపాల్టీ వార్డు కౌన్సిలర్లు, అధికారులు, పట్టణ ప్రముఖులు హాజరు కావాలని కమిషనర్ కోరారు.

విద్యుత్ సరఫరా కోతల వేళలు

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో స్వల్పమార్పులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కోటపాడు, చీపురుగూడెం, పోలవరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారు. జగనన్న ఆశయాన్ని అర్థం చేసుకున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చక్కటి విద్యాభ్యాసంతో కార్పొరేట్‌కు దీటుగా అన్నింటా దూసుకుపోతున్నారు.

- ట్రిపుల్ ఐటీలో అధిక సీట్లు సాధించిన జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్
- ఈ ఏడాది 13 మందికి ట్రిపుల్ ఐటీలో సీట్లు



నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్

నూజివీడు: నూజివీడు పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ నందు ఈ ఏడాది 13 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. ఒక హైస్కూల్ నుంచి ఒకే ఏడాది ఇంత మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు రావడం ఎక్క డా ఉండి ఉండదు. ప్రభుత్వ పాఠశాల అయినా ప్రైవేటుకు దీటుగా ఉపాధ్యాయులు పోటీపడి విద్యార్థులకు పాఠాలు బోధించడం ఇక్కడ ప్రత్యే కత. ప్రైవేటు తరగతులు నిర్వహించడం, చదువు లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం వంటి వాటితో జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ట్రిపుల్ ఐటీల్లో అధిక సీట్లు సాధించారు. మొత్తం 13 మంది సీట్లు సాధించగా, అందులో ముగ్గురు విద్యార్థినులు వేరే కోర్సులకు వెళ్ల గా, 11మంది మాత్రం ట్రిపుల్ ఐటీల్లో చేరారు. నూ జివీడు ట్రిపుల్ ఐటీలో నలుగురు, ఒంగోలు ట్రిపు ల్ ఐటీలో ముగ్గురు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో నలుగురు చేరారు. నియోజకవర్గ వ్యాప్తంగా అయితే ఈ ఏడాది ప్రభుత్వ హైస్కూళ్లలో చదివిన వారిలో 20 మందికి ట్రిపుల్‌ఐటీలో సీట్లు లభించాయి.

నాలుగేళ్లలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన వారి వివరాలు

సంవత్సరం	సీట్లు సాధించిన వారి సంఖ్య
2019-20	2
2020-21	3
2021-22	3
2022-23	13

విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రోత్సాహం

ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను గతేడాది నుంచి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు కష్టపడి చదువుకోవడంతో పాటు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధిస్తున్నందున వారిలో మరింత పట్టుదల పెంచాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే తన వంత సాయాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా గతేడాది ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన 36 మంది విద్యార్థులకు, ఈ ఏడాది సీట్లు సాధించిన 20 మందికి ఒకొక్కరికి రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక నగదును అందజేశారు.



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులకు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు (ఫైల్)

విద్యార్థుల అభివృద్ధికి సమష్టి కృషి



పదో తరగతిలో విద్యార్థినులను మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు. చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడం, బాగా చదివే వారిని గుర్తించి వారిపై మరింతగా శ్రద్ధ తీసుకుని చదివించడం చేస్తుండటంతో ట్రిపుల్ ఐటీకి 13 మంది ఎంపికయ్యారు.

– వీవీఎస్ సత్యనారాయణ, హెచ్ఎం, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్, నూజివీడు

జాబ్‌మేళాలో 128 మందికి ఉద్యోగాలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రభుత్వం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేలా కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని శారదా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుకున్న యువత అందరికీ ఉద్యోగాలు లభించేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ఏకైక ధ్యేయమన్నారు. పేద, బలహీన వర్గాల యువత ఉద్యోగాలు చేసినట్లయితే వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగవుతాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ మాట్లాడుతూ జాబ్‌మేళాలను నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారికి స్కిల్ హబ్‌లలో మూడు నెలల పాటు శిక్షణనిచ్చి వారిలో నైపుణ్యాలను పెంపొందింపజేస్తున్నామన్నారు. జాబ్ మేళాలో 14 కంపెనీలు పాల్గొనగా, 314 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 128 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సీ మధుభూషణ్‌రావు, శారద విద్యాసంస్థల కరస్పాండెంట్ కుప్పాల శంకరరావు, ఏపీఎం దయాల రాజశేఖర్, రైతు సలహా మండలి చైర్మన్ పల్లె రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

తిరువూరు: జగనన్న కాలనీలలో పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీటీకొత్తూరులోని జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వెంటనే పక్కా గృహాల నిర్మాణం చేపట్టాలన్నారు. కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, నీరు, విద్యుత్, రహదారి సదుపాయాలు కల్పించామన్నారు. లబ్ధిదారులకు రూ.2లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్లతో మెప్మా అధికారులు సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు కావాల్సిన సిమెంటు, ఇసుక, ఇనుము సరఫరా చేస్తున్నామన్నారు. నూరుశాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యంగా ఇంజినీరింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. హౌసింగ్, బ్యాంకుల అధికారులు గోపాలరావు, దేవేంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కో–ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ

నూజివీడు: పట్టణ అభివృద్ధికి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ, తాగు నీటి సరఫరా విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు పేర్కొన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కోతుల సమస్య ఎక్కువగా ఉందని, మహిళలు, పిల్లలు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. కోతుల బెడద తగ్గించేందుకు కొండముచ్చులను కొనుగోలు చేసి కోతులు తిరిగే ప్రాంతాల్లో తిప్పడానికి చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ కే లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, ప్రసాదరావు, ప్రతిపక్ష నాయకుడు చెరుకూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సర్దార్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



గంపలగూడెం మండలం కనుమూరులో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి పటేల్‌కు నివాళి

మైలవరం: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను విద్యార్థు లు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సర్దార్ వల్లభ్ భాయ్ పటే ల్ జయంతి(జాతీయ ఏక్తా దివస్)ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ సంస్థానాలను విలీనం చేసిన ఘనత పటేల్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ఎస్.ఉమామహేశ్వరరెడ్డి, విభాగపు ఇన్‌చార్జిలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన నివాళి

రెడ్డిగూడెం: ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్‌పటే ల్ జయంతి వేడుకలను రెడ్డిగూడెం మండల పరి షత్ కార్యాలయం నందు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర ప టానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అ లాగే జాతీయ సమైక్యత దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షుడు రామినేని దేవి ప్రవణ్య, సర్పంచ్ మల్లాది రాణి, సచి వాలయ కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు రామినేని వీరస్వామినాయుడు, ఎం పీడీఓ విష్ణు ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: స్వాతంత్ర్యానంతరం దేశ సమైక్యతకు సాహసోపేతమైన చర్యలు చేపట్టిన గొప్ప నాయకుడు సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ అని ఎంపీడీఓ వీఏ విజయ్ కుమార్ అన్నారు. ముక్కొల్లుపాడులోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యానంతరం దాదాపు 500కు పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ధైర్యశాలి వల్లభాయ్‌పటేల్ అని ఎంపీడీఓ కొనియాడారు. ఈఓపీఆర్డీ టీ సరస్వతి, ఎంఈఓ–2 సంగెపు జమలయ్య, హెచ్ఎం గొర్రెముచ్చు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా దినోత్సవం

తిరువూరురూరల్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని జాతీయ సమైక్యతా దినోత్సవంగా తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. కొమ్మిరెడ్డిపల్లి, ఎరుకోపాడు, రోలుపడి, ముష్టికుంట్ల, కాకర్ల, అక్కపాలెం, మునుకుళ్ళ, మల్లేల, కోకిలంపాడు, ఆంజనేయపురం, చౌటపల్లి, వావిలాల గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమైక్యతా దినోత్సవ ప్రదర్శన నిర్వహించారు.

తిరువూరులో..

తిరువూరు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి కార్యక్రమాలను తిరువూరు కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఇరువురు నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి పార్టీ నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, జీవన్‌బాబు, ప్రకాశరావు, కృష్ణమోహన్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కె.తాదేపల్లి హైస్కూల్లో..

కె.తాదేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జాతీయ సమైఖ్యతా ప్రతిజ్ఞ చేయించారు.

జాతీయ సమైక్యతా ర్యాలీ

ఆగిరిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరూ దేశ సమైక్యత కోసం పాటుపడాలని ఎంపీడీఓ శంకర్రావు అన్నారు. దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సాహసోపేత నిర్ణయాలు తీసుకుని అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్వేశ్వరరావు, హౌసింగ్ ఏఈ హలీముల్లా, ప్రధాన ఉపాధ్యాయురాలు పుష్పలత పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: ధైర్య, సాహసాలతో ఒకరు స్వదేశీ సంస్థానాలను స్వతంత్ర భారతావనిలో విలీనంచేస్తే, మరొకరు రాజ భరణాల రద్దు, గరీబీ హఠావో అంటూ భారత దేశ కీర్తిని దశ, దిశలా చాటి భారతదేశపు ఉక్కు మనుషులుగా నిలిచారని జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, హైస్కూల్ హెచ్ఎం సునీల పేర్కొన్నారు. భారతదేశ తొలి ఉప ప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏక్తా దివస్ ర్యాలీ నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మాజీ ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ సమైఖ్యతా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఏఓ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ స్ఫూర్తితో విద్యార్థులు దేశ భక్తిని అలవర్చుకోవాలని హెచ్ఎం పీ గోపాల్ తెలిపారు. మైలవరం 6వ వార్డులోని ఎంపీపీ పాఠశాలలో పటేల్ జయంతి వేడుకలు సందర్భంగా ఏక్తా దివస్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కనుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ సందర్భంగా గ్రామంలోని మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ఉక్కుమనిషికి నివాళులర్పించారు. హెచ్ఎం నాగలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.



మైలవరంలో పటేల్ జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు



నూజివీడులో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్



తిరువూరు కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిర, పటేల్ చిత్రపటాలకు నివాళి

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మండలంలోని మొర్సపూడిలో వ్యక్తి దాడి చేసిన ఘటనలో గాయపడి పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వితంతువు, ఆమె ముగ్గురు కుమార్తెలను మంగళవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. గ్రామానికి చెందిన జుట్రు ఆంజనేయులు దాడి చేసి కొట్టడంతో వితంతువు తాడిశెట్టి నాగమణి, ఆమె ముగ్గురు కుమార్తెలు తీవ్రంగా గాయపడిన సంగతి విదితమే. ఈ పరిస్థితిలో ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ నరేంద్రసింగ్‌తో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్సను అందించి త్వరగా కోలుకునేలా చూడాలన్నారు.

పార్టీకి సంబంధం లేదు

ఈ వ్యవహారంలో ఎల్లోమీడియా రాజకీయరంగు పులుముతూ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఈ ఘర్షణకు, వైఎస్సార్ సీపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.

రికార్డుల పరిశీలన

కె.తాదేపల్లి(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పూర్తి చేసిన రైతుల భూములకు సంబంధించి గ్రౌండ్ వాలిడేషన్ కొత్తూరు తాడేపల్లి గ్రామంలో జరుగుతోంది. రైతులకు సంబంధించిన వ్యవసాయభూముల దస్తావేజులు, రీసర్వే పూర్తి చేసిన వివరాలను మంగళవారం వీఆర్వో శ్రీనివాసరావు పరిశీలించారు. గ్రామంలోని కొందరు రైతులు దేవదాయశాఖకు చెందిన భూములను కొనుగోలు చేసి దస్తావేజులను చూపెడుతుండగా దేవదాయశాఖకు చెందిన అధికారులు అవి తమవే అని చెప్పడంతో కొంత వాగ్వాదం నెలకొంది. ఆర్ఎస్ నంబర్ 134/4 లో ఎకరం 13 సెంట్లు భూమిని గ్రామ సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు 1981వ సంవత్సరంలో దేవదాయభూమిని కొనుగోలు చేయగా ఇప్పుడు అదే భూమి తమ శాఖకు సంబంధించిందేనని ఈఓ చెప్పడంతో కొంత వివాదం జరిగింది. అంతేగాక గ్రామంలోని గోసంరక్షణకు చెందిన 5 ఎకరాల 40 సెంట్లు భూమికూడా దేవదాయశాఖకు చెందినదేనని, మరి కొన్ని సర్వే నంబర్లలోని భూములు తమవేనని దేవదాయశాఖ ఈఓ తెలిపారు. దస్తావేజులను సమర్పించాల్సి ఉంటుందని దేవదాయశాఖ అధికారులతో వీఆర్వో చెప్పారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం కొండపల్లిలో మంగళవారం జరిగింది. డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు రైల్వే స్టేషన్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బ్యాంకులను జాతీయం చేసిన ఇందిరాగాంధీ

మైలవరం: బ్యాంకులను జాతీయ చేసిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పిట్టల నాగేశ్వరరావు తెలిపారు. మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మైలవరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.

సర్వోత్తమ గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

పటమట(విజయవాడతూర్పు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సర్వోత్తం గ్రంథాలయం ఆధ్వర్యంలో నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు నవంబర్ 2–4 తేదీల్లో చిత్రలేఖన, కథలు చెప్పటం, పుస్తక సమీక్ష, పైకి చదవటంతో పాటు సాహితీ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సర్వోత్తమ గ్రంథాలయం కార్యదర్శి శారద మంగళవారం తెలిపారు. 2వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సబ్ జూనియర్లకు(1–4 తరగతులకు) కథలకు బొమ్మలు వేయడం, కథలు చెప్పడంలో పోటీలు, జూనియర్లకు(5–7 తరగతులకు) పైకి చదవటంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సీనియర్లు(8–10 తరగతులు)పైకి చదవటం, పుస్తక సమీక్ష, రాయటంలో పోటీలు, 4వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు కళాశాల విద్యార్థులకు పుస్తక సమీక్ష, సాహితీ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పోటీలకు నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొనవచ్చని క్విజ్‌లో ఒక కాలేజీ నుంచి ఒక టీమ్‌కు మాత్రమే పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 79953 13148లో సంప్రదించాలని ఆమె కోరారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికలో అమర గాయకుల స్ఫూర్తి సభ, సినీ స్వరాంజలి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు లాంటి గా యకులు తెలుగు సినిమా పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చినట్లు తెలిపారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో పంటలకు మేలు



ముసునూరులో డ్రిప్ ఇరిగేషన్‌పై శిక్షణ

ముసునూరు: డ్రిప్ ఇరిగేషన్‌తో నీటి వృథా తగ్గి, పంటలకు మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి పీఎస్ రవికుమార్ పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్, బిందుసేద్యం ఆవశ్యకతపై మంగళవారం ఆర్బీకేల సిబ్బంది, రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి రైతు డ్రిప్ పైపులను ఉపయోగించడం ద్వారా చుక్క నీటిని కూడా వృథా కానివ్వకుండా పంటలు పండించి, నీటి సమస్యను అధిగమించేలా రైతులను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేసే రైతులకు 90 శాతం, ఐదెకరాలకు పైగా వ్యవసాయం చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై డ్రిప్ పైపులు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక, ఆర్బీకే డ్రిప్ ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.